క్లుప్తంగా

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



విద్యార్థినులతో ఉపాధ్యాయులు

కొడంగల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి, తోటి వారికి పాఠాలు బోధించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం రాంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ



వికారాబాద్ అర్బన్: వికారాబాద్ డీఎస్పీగా అంజయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ నర్సమ్మ

ధారూర్: మండల పరిధి కేరెల్లి, తరిగోపుల గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం ప్రారంభించారు. కేరెల్లిలో పంచాయతీ నుంచి సంగారెడ్డి ఇంటి వరకు రూ.5లక్షలు, కురువ సాయన్న ఇంటి నుంచి ఎస్సీ వాడ పోచమ్మ మందిరం వరకు రూ.10లక్షలతో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు శ్రీనివాస్, గొల్ల నర్సమ్మ, మాజీ ఉప సర్పంచ్ గోవర్ధన్, నాయకులు చెన్నారెడ్డి, సంగారెడ్డి తదితరులు ఉన్నారు.

లబ్ధిదారుల వివరాల సేకరణ



చెన్నారంలో సర్వే చేస్తున్న ఎంపీఓ, గ్రామ కార్యదర్శి

యాలాల: 2020లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మించుకున్న వారి వివరాలను మండల అధికారులు సేకరిస్తున్నారు. మరుగుదొడ్లను నిర్మించి, ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందని వారి వివరాలను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఆరా తీస్తున్నారు. శుక్రవారం మండల పంచాయతీ అధికారి గాలి యాదయ్య చెన్నారం, అక్కంపల్లి గ్రామాల్లో సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరుగుదొడ్లు నిర్మించుకున్న చాలా మందికి చెల్లింపులు జరగలేదని, వారిని గుర్తించేందుకు సర్వే చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎంపీడీఓ పుష్పలీల టీం లీడర్‌గా, టీం సభ్యుడిగా ఎంపీఓ, ఏపీఓ, ఐకేపీ ఏపీఎం, ఈజీఎస్ ఈసీ సభ్యులుగా ఉన్నారని, రెండు రోజుల్లోగా సర్వే పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అనిరాజ్, లక్ష్మి ఉన్నారు.

'కార్పొరేట్'కు కొమ్ము కాస్తున్న కేంద్రం

- నిత్యావసరాల ధరలు పెంచుతున్న బీజేపీ
- కార్మికుల శ్రమను దోస్తున్న ప్రభుత్వం
- రైతులను పట్టించుకోని ప్రధాని
- మోదీపై కార్మిక సంఘాల ధ్వజం
- శ్రమజీవులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్



వికారాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



కొడంగల్‌లో మాట్లాడుతున్న బుస్స చంద్రయ్య



తాండూరు టౌన్: ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

అనంతగిరి: కేంద్రం ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ.. పేదలను విస్మరిస్తుందని, రైతులను పట్టించుకోవడం లేదని కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా శుక్రవారం వికారాబాద్‌లో జాయింట్ ప్లాట్‌ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో.. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం నుంచి ఎంఆర్‌పీ కూడలి వరకు ర్యాలీ తీశారు. ఇందులో అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, మున్సిపల్, 104, ఐకేపీ, గ్రామ పంచాయతీ, ఐద్వా, గిరిజన, విద్యార్థి సంఘం, కార్మిక విభాగాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడారు. ప్రధాని మోదీ పదేళ్లుగా పెత్తందారులకు అండగా నిలుస్తూ.. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాడని మండిపడ్డారు. నిత్యవసరాల ధరల పెంచుతూ సామాన్యుల నడ్డి విరుస్తున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా.. శ్రమదోపిడి చేస్తున్నారని విమర్శించారు. తీరు మార్చుకోకపోతే.. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మైపాల్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, రైతుసంఘం జిల్లా నాయకుడు అనంతయ్య, ఆయా సంఘాల జిల్లా నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, అనసూయ, రేణుక, అనిత, అక్బర్, భారతి, లక్ష్మి, వసంత, బుచ్చయ్య, శంకర్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

కొడంగల్: కేంద్ర ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలని సీపీఐ సీనియర్ నాయకుడు ఇందనూర్ బషీర్ కోరారు. దేశవ్యాప్త కార్మిక సంఘాల సమ్మెలో భాగంగా గ్రామీణ బంద్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం రైతులకు వ్యతిరేకంగా పనిచేస్తుందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తుందని ఆరోపించారు. అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మహమూద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహీం, సీపీఐ నాయకులు మూతుల రాజు, సిరుసని శ్యాంసుందర్, గొరారం లక్ష్మణ్, ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి

కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. కొడంగల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్మికుల పట్ల అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను కేంద్రం ఉప సంహరించుకోవాలన్నారు. ఇందులో కార్మిక సంఘం నాయకులు రాజు, మోహన్, వెంకటయ్య, మల్లేశ్ యాదవ్ ఉన్నారు.

తీరు మార్చుకోకపోతే గుణపాఠం తప్పదు

తాండూరు టౌన్: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా తాండూరులోని పలు రంగాలకు చెందిన కార్మికులు, సీఐటీయూ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పలుకుతూ, కార్మికులను నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ప్రమాద బీమా రూ.10 లక్షలు, పింఛన్ సౌకర్యం రూ.10 వేలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి కార్మికులు గట్టి గుణపాఠం చెబుతారన్నారు. ఇందులో అంగన్‌వాడీ టీచర్స్ బేబి, సంధ్య, శశికళ, సుజాత, మణిమాల, భాగ్యలక్ష్మి, ఆశ వర్కర్స్ రాజమణి, కౌసల్య, శ్రీదేవి, లక్ష్మి, పంచాయతీ కార్మికులు జిలాని, నర్సింహులు, హమాలీ కార్మికులు భీమప్ప, నర్సింహులు, రాజేష్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేదరికం పెరుగుతోంది



ర్యాలీలో పాల్గొన్న కార్మికులు

పరిగి: కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహరావు ఆరోపించారు. కార్మికుల సమ్మెలో భాగంగా పట్టణ కేంద్రంలోని సీఐటీయూ, కార్మిక సంఘాలతో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ఎదుట రస్తారోకో చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక, మతతత్వ విధానాల వలన.. ప్రజల జీవనాధాయం పడిపోయిందని, దీంతో పేదల సంఖ్య పెరుగుతూ.. దేశంలో 80కోట్ల మంది దారిద్య్రరేఖకు దిగువన ఉన్నారని ఆందోళన వ్యక్తంచేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో లేనిపోని ఆశలు కల్పించి, మరోసారి అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, దీనిని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కేంద్రం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా.. రైతులు అనేక సార్లు పోరాటాలు చేశారని, అయినా పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే తమ లక్ష్యమని, ఆ దిశగా ముందుకు సాగుతామని వెల్లడించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య, నాయకులు హబీబ్, సత్తయ్య, రఘురాం పాల్గొన్నారు.

23న ఎల్లమ్మ రథోత్సవం

కొడంగల్: పట్టణ శివారులో వెలసిన బండల ఎల్లమ్మ అమ్మవారి రథోత్సవం ఈ నెల 23వ తేదీన జరగనుందని ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఉత్సవాలు 21 నుంచి ప్రారంభం అవుతాయని, అదే రోజు సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని రాంరెడ్డి నివాసం నుంచి ఆలయం వరకు అమ్మవారిని పల్లకీలో ఊరేగింపుగా తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. 22న ఉదయం అభిషేకం, ప్రత్యేక పూజలు చేస్తారు. 23న ఉదయం బోనాలు, సాయంత్రం రథోత్సవం, 24న సాయంత్రం ఎద్దులతో ఊరేగింపు, 25న సాయంత్రంపెరుగు బసంతం నిర్వహించనున్నట్లు ధర్మకర్తలు వెల్లడించారు.

సకాలంలో రుణాలు చెల్లించండి

కొడంగల్: ప్రాథమిక సహకార సంఘంలో తీసుకున్న రుణాలను రైతులు సకాలంలో చెల్లించాలని పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పీఏసీఎస్ ద్వారా రైతులకు వ్యవసాయ, పంట, స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు ఇచ్చామని తెలిపారు. మార్చి లోపు పంట రుణాలను రెన్యూవల్ చేయించుకుంటే మిత్తి తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. స్వల్ప, దీర్ఘకాలిక రుణాల కిస్తులు చెల్లించాలని సూచించారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున.. కిస్తులు చెల్లించి, సొసైటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

బోధనలో ఆధునిక పద్ధతులు పాటించాలి

కుల్కచర్ల: పాఠ్యాంశాలు బోధించే సమయంలో బోధనోపకరణాలను ఉపయోగించాలని ముజాహిద్‌పూర్ క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు రాములు అన్నారు. శుక్రవారం మండల పరిధి ముజాహిద్‌పూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ పరిధి ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు పాఠశాలలకు గైర్హాజరు కాకుండా చూడాలని, వారి దస్తూరి మెరుగుపర్చేందుకు తగిన సూచనలు ఇవ్వాలన్నారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవుజా, సీఆర్పీ రాజు, మైపాల్, హన్మయ్య ఉన్నారు.

బాధ్యతలు చేపట్టిన డీపీఆర్‌ఓ

వికారాబాద్ అర్బన్: జిల్లా పౌర సంబంధాల అధికారిగా శుక్రవారం ఎ.చెన్నమ్మ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీపీఆర్‌ఓగా విధులు నిర్వహించిన మహ్మద్ ఆరిఫొద్దీన్ గద్వాలకు బదిలీ అయ్యారు. గద్వాలలో పనిచేసిన చెన్నమ్మ వికారాబాద్‌కు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె.. కలెక్టర్, అదనపు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎన్నాళ్లీ అవస్థలు

- రైల్వేగేట్లతో వాహనదారుల ఇబ్బంది
- అంబులెన్స్‌ల రాకపోకలకు ఆటంకం



గంగారం రైల్వేగేట్ వద్ద భారీగా నిలిచిన వాహనాలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం చుట్టూ రైల్వేలైన్ ఉంది. ఈ లైన్ కారణంగా పట్టణం మధ్య నుంచి.. మూడు మార్గాల్లో (రామయ్యగూడ రోడ్డు, అనంతగిరిగుట్టకు వెళ్లే మార్గం, బూర్గుపల్లి రోడ్డు) మూడు రైల్వేగేట్లు ఉన్నాయి. అయితే ఈ ప్రాంతాల్లో ప్రధాన కాలనీలు, గ్రామాలు ఉండటంతో వాహనాల రాకపోకలు అధికంగా ఉన్నాయి. దీంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉటుంది. ఇదిలా ఉండగా.. ఈ రైల్వేలైన్ గుండా షిరిడీ, పర్బణి, ఔరంగాబాద్ వెళ్లే రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో దినచర్యగా అనేకమార్లు గేటు వేయాల్సి ఉంటుంది. ఈ కారణంగా గేటు పడిన ప్రతిసారి వందలాది వాహనాలు ఇరువైపులా బారులు తీరుతాయి. రైలు వెళ్లిన అనంతరం గేటు తీసినప్పటికీ.. అప్పటి వరకు నిలిచిన వాహనాలు అటుఇటుగా వెళ్లగానే.. మళ్లీ గెటుపడుతుంది. ఇలా రోజులో ఎన్నిసార్లు గేటు పడితే.. అన్నిసార్లు ట్రాఫిక్ కష్టాలను ఎదుర్కోక తప్పడం లేదని, గేటు వలన చేరవలసిన చోటుకు సకాలంలో చేరుకోలేక పోతున్నామని వాహనదారులు, స్థానికులు వాపోతున్నారు.

అత్యవసర వాహనాలు నిరీక్షించాల్సిందే..

రామయ్యగూడ గేట్ అవతలి ప్రాంతంలో దాదాపు 10 కాలనీలు ఉన్నాయి. ఉదయం పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థులకు, ఉద్యోగాలకు వెళ్లేవారికి, వాహనదారులకు, అత్యవసర పనుల నిమిత్తం వెళ్లే వారికి ఈ గేటు వలన తీవ్ర అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా అనంతగిరి వెళ్లే మార్గంలో తాండూరు తదితర ప్రాంతాల నుంచి వెళ్లే సాధారణ వాహనాలతో పాటు అంబులెన్స్‌లు ఆగాల్సి వస్తోంది. ఇలా అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు నిరీక్షిస్తే.. బాధితుల పరిస్థితి ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు చొరవ తీసుకుని, అండర్ బ్రిడ్జి లేదా పై వంతెనల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే.. ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఆత్మవిశ్వాసంతో సమస్యలను ఎదుర్కోవాలి

తాండూరు టౌన్: జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఆత్మ విశ్వాసంతో ఎదుర్కోవాలని తాండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్, స్వాధ్యాయ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకుడు డాక్టర్ సాయి ఆచార్య సూచించారు. శుక్రవారం ఫౌండేషన్, అర్థశాస్త్ర విభాగం, ఐక్యూఏసి ఆధ్వర్యంలో విద్యార్థులకు జీవిత నిర్వహణ (లైఫ్ మేనేజ్‌మెంట్)పై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిరాశ, నిస్పృహలను అధిగమించి ఏకాగ్రత, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని చెప్పారు. సమస్యలు స్థిరంగా ఉండవని, మన పట్టుదల, శ్రమ వాటిని ఎప్పటికైనా దూరం చేస్తాయని పేర్కొన్నారు. అనంతరం కెరీర్ కౌన్సిలర్ స్వాతి బొలిశెట్టి, వాయిస్ కల్చర్ అండ్ యాక్టింగ్ ట్రైనర్ డాక్టర్ సురభీరమేష్‌లు విద్యార్థులను గ్రూపులుగా విభజించి ఏకాగ్రత, భావ వ్యక్తీకరణ తదితర అంశాల పట్ల పలు కృత్యాలు చేయించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వివేక్, అర్థశాస్త్ర విభాగ అధ్యాపకులు మహేందర్ రెడ్డి, సంగమేశ్వర్, ఐక్యూఏసి కోఆర్డినేటర్ కిషన్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహాదేవునికి ప్రత్యేక పూజలు

కొడంగల్ రూరల్: పట్టణంలోని శ్రీమహాదేవుని ఆలయంలో శుక్రవారం శివ భక్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హస్నాబాద్, పరిసర గ్రామాల భక్తులు భజనలో పాల్గొన్నారు. దేశ్‌ముఖ్ కుటుంబసభ్యులు, రావులపల్లి మాజీ సర్పంచ్ శివస్వామి రమేష్‌రెడ్డి, శివస్వాములు గురుస్వామి గడ్డం చంద్రశేఖర్ సమక్షంలో శివలింగానికి పంచామృతంతో అభిషేకం, శివాష్టకం, లింగాష్టకం, శివాష్టోత్తర శతనామావళితో విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి నైవేద్యం సమర్పిస్తూ మంగళహారతులు పట్టారు. నిజలింగప్ప దేశ్‌ముఖ్, సందీప్ రెడ్డి దేశ్‌ముఖ్‌లు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం పార్వతమ్మ దేశ్‌ముఖ్ జ్ఞాపకార్థం భక్తులను అన్నదానం చేశారు.

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



బాలికలకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కుల్కచర్ల: ప్రతి విద్యార్థిని వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ.. ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రత్యేకాధికారి దేవి, ఆర్బీఎస్కే మెడికల్ టీం కోఆర్డినేటర్ నరేందర్ సూచించారు. శుక్రవారం కేజీబీవీలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు స్వచ్ఛత పాటించడంతో పాటు ఆహారపు సరైనవి ఎంచుకోవాలని చెప్పారు. అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ఏదైనా అనారోగ్య సమస్యలు వస్తే.. ఉపాధ్యాయులకు చెప్పాలని సూచించారు. ఏకాగ్రతను పొందేందుకు ధ్యానం చేయాలన్నారు. వైద్య సిబ్బంది సూరమ్మ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

- ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం
- కాంట్రాక్టర్లతో కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి



కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి

తాండూరు టౌన్: మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో పలువురు కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు అభివృద్ధి పనుల పెండింగ్‌పై ఇంజినీర్ ఖాజా హుస్సేన్‌తో కలిసి చర్చించారు. గతంలో అభివృద్ధి పనులకు పలుమార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడానికి గల కారణాల గురించి ఆరా తీయగా.. నాడు అభివృద్ధి పనులపై అనేక ఒత్తిళ్లు వచ్చాయని, చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని కాంట్రాక్టర్లు, కమిషనర్ దృష్టికి తెచ్చారు. అయితే ఇకపై ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని, నాణ్యతతో కూడిన నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం 60 రకాల పనులకు సంబంధించిన టెండర్లు, నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరలోనే పూర్తి చేస్తామని కమిషనర్ తెలిపారు.

ప్రజాశ్రేయస్సే ముఖ్యం



డీఎస్పీ, సీఐలను సన్మానించిన ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: ఎక్కడికి వెళ్లినా ప్రజాశ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని, అదే మనకు గుర్తింపు తెస్తుందని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిన డీఎస్పీలు, సీఐలను తన కార్యాలయంలో ఎస్పీ శుక్రవారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సాధారణమని చెప్పారు. విధినిర్వహణలో మనం చేసిన సేవలే చిరకాలం గుర్తుండిపోతాయని సూచించారు. అంతకు ముందు జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, డీటీసీ ఏఎస్పీ మురళీధర్, పరిగి డీఎస్పీ కరుణాకర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేష్, బదిలీపై వెళ్లిన డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

భరోసా లేని బతుకులు!

- అదనపు బాధ్యతలతో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సతమతం
- చాలీచాలని వేతనాలతో వెతలు
- శ్రమను గుర్తించడం లేదంటూ ఉద్యోగుల ఆవేదన



దౌల్తాబాద్ ఎంఆర్‌సీ కార్యాలయం

దౌల్తాబాద్: సమగ్ర శిక్షా అభియాన్‌లో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న సిబ్బంది వెతలు వర్ణనాతీతం. కనీస వేతనాలకు నోచుకోక, ఉద్యోగ, ఆరోగ్య భద్రత లేక ఇబ్బంది పడుతున్నారు. రెండు దశాబ్దాలకు పైగా శ్రమిస్తూనే ఉన్నామని, అదనపు బాధ్యతలతో సతమతమవుతున్నా.. తమ శ్రమను ప్రభుత్వం గుర్తించడం లేదని, తమ బతుకులకు భరోసా లేకుండా పోయిందని ఉద్యోగులు వాపోతున్నారు.

67 పాఠశాలలకు గాను..

ఎస్ఎస్ఏ(సమగ్ర శిక్షా అభియాన్)లో సీఆర్‌పీలు(క్లస్టర్ రిసోర్స్‌పర్సన్), ఎంఐఎస్(మండల ఇన్ఫర్మేషన్ సిస్టమ్) కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్స్ కాంట్రాక్టు పద్ధతిన 2003నుంచి పనిచేస్తున్నారు. జిల్లాలోని 67 పాఠశాల క్లస్టర్లకు గాను (మొత్తం 150మంది) సీఆర్‌పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డాట ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు పనిచేస్తున్నట్లు రికార్డుల్లో ఉంది.

వీరి విధులు..

2001లో సమగ్ర శిక్షా అభియాన్ ప్రారంభమైంది. సీఆర్‌పీలు మండలానికి నలుగురు లేదా ఐదుగురు చొప్పున ఉంటారు. అయితే క్లస్టర్‌కు ఒకరు చొప్పున ఉంటారు. వీరు ఎంఐఎస్‌లు ఎంఈఓ కార్యాలయంలో పనిచేస్తారు. ఎంఈఓ చెప్పిన వాటిని రికార్డు చేసి, ఆపై డాటా ఎంట్రీ చేయిస్తారు. ఇక్కడే డాటా ఎంట్రీ ఆపరేటర్లు విధులు నిర్వహిస్తారు. సీఆర్‌పీలు పనిచేసే చోటే మెసెంజర్స్ కూడా ఉంటారు. అందరూ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విధులు నిర్వహిస్తారు. సీఆర్‌పీలు, ఎంఐఎస్‌లు ఎప్పటికప్పుడు పాఠశాలలను తనిఖీ చేస్తారు. విధులకు ఉపాధ్యాయులు గైర్హాజరైతే వీరే పాఠాలు బోధిస్తారు. రోజూ ఎంతమంది ఉపాధ్యాయులు, విద్యార్థులు వచ్చారనే వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. విద్యార్థుల పరీక్షకు అవసరమైన ప్రశ్నపత్రాలను అందజేస్తారు. పాఠశాలల పరిశీలన, మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తారు.

పనికి.. తగ్గ వేతనం ఇవ్వాలి

ప్రభుత్వ ఉద్యోగులతో పాటు తమకు కూడా సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి. కనీస వేతనాలు రూ.45వేలు, ఉద్యోగ భద్రత కల్పించాలి. రెగ్యులరైజ్ చేయాలి. టీఏడీఏల మంజూరుతో పాటు ఆరోగ్య భద్రత కల్పించాలి. ఎస్ఎస్ఏ సంఘం తరఫున తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. – కాంట్రాక్ట్ ఉద్యోగులు

నిబంధనల మేరకు వేతనం

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్ఎస్ఏ సిబ్బందికి వేతనాలు మంజూరు చేస్తున్నాం. ఆ ప్రకారమే వారి బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమ అవుతాయి. వారి డిమాండ్లు ప్రభుత్వ పరిధిలో ఉన్నాయి. – వెంకటయ్య, ఎంఈఓ

సంక్షిప్త వార్తలు

• ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీరోడ్డు

మోమిన్‌పేట: మండల పరిధి బాల్‌రెడ్డిగూడెం గ్రామంలో శుక్రవారం రూ.5లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీరోడ్డు పనులు ప్రారంభించినట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నరోత్తంరెడ్డి తెలిపారు. తమ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ఇందులో నాయకులు భుజంగ్‌రెడ్డి, కాంతిరెడ్డి, హరీశ్‌కుమార్ రెడ్డి, అనంత్‌రెడ్డి, మైపాల్, చెన్నారెడ్డి, బక్కారెడ్డి, వెంకటయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

• నూతన కమిటీ నియామకం



దోమ: మండల పరిధి బాసుపల్లి గ్రామంలో శుక్రవారం గొల్ల కురుమ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఫీల్డ్ ఆఫీసర్ కుమారి ఆధ్వర్యంలో కమిటీని ఎంపిక చేసి, నియామకపత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడిగా మంత్రి శ్రీశైలం, ఉపాధ్యక్షుడిగా కురువ శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా గొల్ల బుచ్చయ్య, సలహాదారులుగా మొగిలిగిద్ద శ్రీనివాస్, కోశాధికారిగా కురువ నారాయణ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

• సునీతమ్మ వెంటే మేము..



తాండూరు రూరల్: వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి వెంటే తాము నడుస్తామని చెన్‌గేస్‌పూర్ గ్రామ నాయకులు చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లో చైర్‌పర్సన్ నివాసంలో ఆమెను కలిసి, కాంగ్రెస్ పార్టీలో చేరినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో సీనియర్ నాయకులు రాజు గౌడ్, వెంకటేశం, శ్రీశైలంగౌడ్ ఉన్నారు.

• వ్యాపారుల నిరసన

పరిగి: మార్కెట్ వ్యాపారులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ.. శుక్రవారం పరిగి మార్కెట్ యార్డులో పలువురు వ్యాపారులు తమ దుకాణాలను బందుచేసి, నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అచ్చంపేట, మహబూబ్‌నగర్‌లో వ్యాపారులపై ఇటీవల జరిగిన దాడులను ఖండిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ధాన్యం విక్రయించేందుకు మార్కెట్‌కు వచ్చిన రైతులు.. దుకాణాలు మూసి ఉండటంతో వెనుదిరిగి పోయారు.

• ఎమ్మెల్యేకు ధన్యవాదాలు

తాండూరు రూరల్: గొర్రెలు, మేకల పెంపకం దార్ల విషయమై అసెంబ్లీలో మాట్లాడిన తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు జీవాల పెంపకం దార్ల సంఘం నాయకులు గౌతపూరర్ వెంకటయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వంలో యూనిట్ల కోసం డీడీలు కట్టామని, అయినా ఇప్పటి వరకు గొర్లు ఇవ్వలేదని తెలిపారు. లబ్ధిదారులకు వెంటనే న్యాయం చేయాలని కోరారు.

• అగ్నిప్రమాదాలపై అవగాహన

దోమ: ఇళ్లలో గ్యాస్ సిలిండర్ల వినియోగం, ఇబ్బందికర పరిస్థితులు తలెత్తినప్పుడు ఏ విధంగా వ్యవహరించాలన్న అంశాలపై పరిగి అగ్నిమాపక సిబ్బంది శుక్రవారం బొంపల్లి ప్రాథమిక, జెడ్పీ పాఠశాలలో అవగాహన నిర్వహించారు. తగిన జాగ్రత్తలు పాటిస్తూ, అగ్నిప్రమాదాల నుంచి ప్రజలు రక్షణ పొందవచ్చని, వాటిని నివారించవచ్చునని సూచించారు. ఇందులో ప్రధానోపాధ్యాయులు వెంకట్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

• అర్థమయ్యేలా బోధించాలి

దోమ: విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించాలని విద్యాధికారి హబీబ్ అహ్మద్ అన్నారు. శుక్రవారం మండల పరిధి కిష్టాపూర్, దాదాపూర్, బొంపల్లి పాఠశాలలో కాంప్లెక్స్ పరిధిలో ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించే సందర్భంలో బోధనోపకరణాలను ఉపయోగించాలని సూచించారు. విద్యార్థులు భాషా పరిజ్ఞానం, రాయడం, చదవడంలో నైపుణ్యం పెంపొందించుకునేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని చెప్పారు. ఇందులో మండల నోడల్ ఆఫీసర్ వెంకట్, ప్రధానోధ్యాయుడు రాములు, జయరాం పాల్గొన్నారు.

• కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీలు

బంట్వారం: బీఆర్‌ఎస్‌కు చెందిన రొంపల్లి, జిన్నారం ఎంపీటీసీ సభ్యులు శ్రీకాంత్‌రెడ్డి, బందెయ్య శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా నగరంలోని సునీతారెడ్డి నివాసంలో ఎంపీటీసీలు ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు బీఆర్‌ఎస్ కోట్‌పల్లి మండల ఉపాధ్యక్షుడు ఓగులాపూర్ నరేందర్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఇందులో రొంపల్లి మాజీ ఎంపీటీసీ రమేష్, ఇందోల్ లింగారెడ్డి ఉన్నారు.

• వైభవంగా సీతారాముల కల్యాణం



కుల్కచర్ల: మండల పరిధి పుట్టపహాడ్ గ్రామంలో శ్రీ కోదండ సీతారామ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. వేడుకలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామివారికి పూజలు చేశారు.



కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామం శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో శివమాలను ధరించిన భక్తులు – కుల్కచర్ల